నమస్తే తెలంగాణ

సిద్ధిపేట

I | హైదరాబాద్, ఆదివారం 16 మార్చి 2025 | SIDDIPET

అక్రమంగా కోళ్లదాణాను కొనుగోలు చేసిన వ్యాపారి రవీందర్ గోదాంలో దాణా బ్యాగులు

109 బస్తాల కోళ్ల దాణా పట్టివేత

- వ్యాపారిపై కేసు నమోదు

కోళ్ల దాణాను పరిశీలిస్తున్న నిజాంపేట పోలీసులు, హేచరీస్ నిర్వాహకులు

రామాయంపేట, మార్చి 15: అక్రమంగా ఓ వ్యాపారి కోళ్లదాణాను రైతుల నుంచి కొనుగోలు చేసిన సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. నిజాంపేట మండల శివారులోని వెంకటేశ్వర హేచరీస్, రామాయంపేట స్నేహ చికెన్ వారు రైతులకు కోళ్లకు వేసే దాణాను అందజేశారు. రైతులు తమ కోళ్లకు వేసేందుకు తీసుకున్న దాణాను దొంగచాటుగా విక్రయించారు. హేచరీస్ సంస్థకు చెందిన వారు వల పన్ని ఆటోల్లో తీసుకెళ్తున్న కోళ్లదాణాను పట్టుకున్నారు. కొద్ది రోజులుగా గుట్టుచప్పుడు గాకుండా నిజాంపేటకు చెందిన వ్యాపారి వైష్ణవి ట్రేడర్ ఆధినేత రవీందర్ రైతుల నుంచి దాణాను కొనుగోలు చేస్తున్నారు. ఫౌల్ట్రీ ఫాం యజమానులు రైతులకు ఉచితంగా ఈ కోళ్ల దాణా బస్తాలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 109 బస్తాలను అక్రమంగా వ్యాపారి రవీందర్ కొనుగోలు చేశారని, ఒక్కో బస్తా రూ.3500 ధర ఉంటుందని వెంకటేశ్వర, స్నేహ చికెన్ నిర్వాహకులు తెలిపారు. తమ కోళ్ల ఫారాలకు చెందిన దాణాను అక్రమంగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వ్యాపారి రవీందర్‌పై నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి వ్యాపారి గోదాంను సీజ్ చేసినట్లు తెలిపారు. హేచరీస్‌కు సంబంధించిన రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు వ్యాపారి వైష్ణవి ట్రేడర్ రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట ఎస్సై తెలిపారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్ కొరడా

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: పన్ను వసూళ్లల్లో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. శనివారం సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మున్సిపాలిటీలకు సంబంధించిన పన్నులు, ఇంటి, ఆదాయ, కుళాయి బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించినందుకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెలాఖరులోగా 100 శాతం ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలు చేయాలని లక్ష్యం విధించగా, ఈ మూడు మున్సిపాలిటీల్లో బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం కొంత మంది మున్సిపాలిటీ బిల్ కలెక్టర్లు, రెవెన్యూ మేనేజర్లకు సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ సిబ్బంది పనితీరులో మార్పు రాకపోవడంతో కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో కమిషనర్ ఉమామాహేశ్వరరావు, మేనేజర్ ఉమేశ్వర్‌లాల్, 8 మంది బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఎస్పీ వీకే చవాన్, మేనేజర్ సూర్యప్రకాశ్, 27 మంది బిల్ కలెక్టర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదాశివపేట మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ జె.ఉమ, మేనేజర్ ఉమర్ సింగ్, 14 మంది బిల్ కలెక్టర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ షోకాజ్ నోటీసులకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని నోటీసుల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తిస్థాయి ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేలా చొరవ చూపేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 31లోగా డబ్బులు చెల్లిస్తే 25శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. దరఖాస్తుదారులకు రాయితీ మినహాయిస్తూ వెంటనే ల్యాండ్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్ల, లేఅవుట్లలో ఉన్న దరఖాస్తుదారులకు నూతన ఎల్ఆర్ఎస్ విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన బ్యానర్లు, గోడ పత్రికలు, ప్రకటన బోర్డులను అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు. మైకుల ద్వారా ఆటోలతో ప్రచారం చేయించాలన్నారు. దరఖాస్తుదారులకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సహాయం అందించాలని, ఈ అవకాశాన్ని జిల్లాలోని అనుమతి లేని ప్లాట్ల లేఅవుట్లు, స్థలాలు కొన్నవారు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

రేవంత్ పాలనలో ఆగిన అభివృద్ధి

విద్యుత్ నగర్ ఇఫ్తార్ విందులో ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

విద్యుత్ నగర్‌లో ఆటోవాలాలకు బియ్యం బస్తాలను అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- కాంగ్రెస్ వచ్చాక తెల్లాపూర్ ప్రగతికి బ్రేకులు
- బీఆర్ఎస్ హయాంలో రూ.75కోట్లు మంజూరు
- కాంగ్రెస్ సర్కార్ రూ.50కోట్లు వెనక్కి తీసుకుంది..
- రేవంత్‌రెడ్డి చెప్పేది కొండంత.. చేసేది గోరంత
- బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం
- కాంగ్రెస్‌లో మైనార్టీలకు తీవ్ర అన్యాయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

రామచంద్రాపురం, మార్చి 15: కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు మల్లేపల్లి సోమిరెడ్డి ఏర్పాటు చేయించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఇఫ్తార్ విందు అనేది హిందూ ముస్లింల ఐక్యతను ప్రదర్శిస్తూ, ఒకరి మతాన్ని మరొకరు గౌరవించి కలిసి జీవించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. 20 సంవత్సరాలుగా పదవిలో ఉన్నా లేకపోయినా సోమిరెడ్డి ఇఫ్తార్ విందు ఇస్తూ ముస్లింలను గౌరవిస్తున్నారని అభినందించారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, మైనార్టీల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మత ఘర్షణలు జరుగుతున్నాయని, కేసీఆర్ హయాంలో హిందూ, ముస్లింలు సోదరులుగా కలిసి ఉన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ తోఫాలను ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో మైనార్టీ నుంచి ఒక్క మంత్రి లేడని, మొన్నటి ఎమ్మెల్సీల్లో కూడా మైనార్టీలకు చోటు లేదని చెప్పారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని చెప్పుకుంటున్నదని, కానీ.. ఈరోజు అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి తనకి మోదీకి ఉన్న అనుబంధాన్ని వ్యక్తపరిచాడని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమైందన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పేది కొండంత.. చేసేది గోరంత అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న మోసాలను బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ఎండగడుతుందని తెలిపారు.

తెల్లాపూర్ అభివృద్ధి కుంటుపడింది..

బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో తెల్లాపూర్ మున్సిపాలిటీకి రూ.75కోట్లు మంజూరు చేస్తే, అందులో రూ.25కోట్లు పనులు జరిగాయని గుర్తుచేశారు. మిగతా రూ.50కోట్లు రేవంత్‌రెడ్డి సర్కార్ వెనక్కి తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లాపూర్ అవసరాల కోసం తమ హయాంలో రూ.500కోట్ల విలువైన భూమిని మంజూరు చేయిస్తే, అందులో రూ.10కోట్లతో మున్సిపల్ భవనం, రూ.10కోట్లతో అద్భుతమైన ఫంక్షన్ హాల్ నిర్మించామని, పనులు జరిగినా ఫంక్షన్ హాల్‌ని ప్రారంభించడం లేదన్నారు. వెజ్ అండ్ నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణం నిలిచి పోవడంతో అందులో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని అన్నారు. సబ్‌స్టేషన్ కోసం భూమిని కేటాయిస్తే అందులో ఇప్పటి వరకు పనులు జరగడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో మాటలు తప్ప చేతలు శూన్యమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెల్లాపూర్‌కు పెండింగ్ నిధులు ఇచ్చి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. అంతకు ముందు తెల్లాపూర్‌లోని మున్సిపల్ భవనం, ఫంక్షన్ హాల్‌ని సందర్శించి విద్యుత్ నగర్‌లో సోమిరెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హరీశ్‌రావు ప్రారంభించారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్లకు రైన్ బ్యాగ్‌లు అందజేశారు. అనంతరం కొల్లూర్ 2బీహెచ్‌కేలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, గువ్వల బాలరాజు, రసమయి బాలకిషన్, కార్పొరేటర్ మెట్టుకుమార్, కార్మిక నాయకుడు ఎల్లయ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, రాములు గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అంజయ్య, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను ఎండబెట్టారు

- ప్రభుత్వంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా ఫైర్

అసెంబ్లీలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 15: జనగామ నియోజకవర్గ సమస్యలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం సర్కారుపై ఫైర్ అయ్యారు. దేవాదుల ఎత్తిపోతల నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు పంపింగ్ చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపారని, మొదటిసారి కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఎండబెట్టారని, దీంతో రూ.600 కోట్ల నష్టం కలిగిందన్నారు. రిజర్వాయర్ నిర్దేశిత ఆయకట్టుకు నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దేవాదుల నిర్వాహణ సంస్థలకు రూ. 6 కోట్లు ఇవ్వలేదని, దీంతో 34 రోజుల పాటు సంస్థ ఉద్యోగులు సమ్మె చేశారని, అసలు ప్రజా ప్రభుత్వం పాలన ఇదేనా అని ప్రశ్నించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తపాస్‌పల్లి నుంచి నీళ్లు తీసుకుపోతానని అంటాడని, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే సైతం నీళ్లు తీసుకుపోతానని అంటే ఏంటని ప్రశ్నించారు. రైతులకు బోనస్ అనేది బోగస్ అయిపోయిందని, కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు పెరిగిపోయాయని, ఇప్పటి వరకు 564 రైతుల ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పంట రుణమాఫీ వందశాతం చేశామని ప్రకటించిన సర్కారు తన నియోకవర్గంలోని 127 గ్రామాల్లో ఏ గ్రామానికైనా వెళ్లి విచారణ చేస్తామని, 100 శాతం రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాయడమే కాకుండా రాజీనామా చేస్తానని ప్రకటించారు. రైతుబీమాను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంపులను వెంటనే ఆన్ చేయండి

చేర్యాల, మార్చి 15: జనగామ నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్లు నింపాలని శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో మధ్యాహ్నం ప్రభుత్వం పంపులను వెంటనే ఆన్ చేయాలని ఆదేశించింది. అధికార యంత్రాంగం బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తే సరిపోదన్నారు. బొమ్మకూరుతో పాటు కన్నెబోయినగూడెం, లద్నూర్, తపాస్‌పల్లి రిజర్వాయర్లను వెంటనే నింపాలన్నారు. దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చేటటువంటి కొత్తది పైపులైన్ ఏదైతే ధర్డ్ ఫేస్‌లో ఉన్నదో దానిని వెంటనే ఆన్‌చేయాలన్నారు. సీఎం వెంటనే మూడో ఫేస్‌ని ఆన్ చేయాలని కోరారు రిజర్వాయర్లను నింపి తద్వారా చెరువులు నింపి పంటలు కాపాడాలని కోరారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

హుస్నాబాద్‌లో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ రాస్తారోకో

హుస్నాబాద్ టౌన్, మార్చి 15: శాసనసభ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ నిరసిస్తూ శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఆందోళనలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ కౌన్సిలర్లు పెరుక భాగ్యారెడ్డి, గూళ్ల రాజు, భూక్యా లక్ష్మణ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు అయిలేని శంకర్‌రెడ్డి, కన్నోజు రామకృష్ణ, గడిపె కొమురయ్య, కొంకట రవీందర్, బొల్లి శ్రీనివాస్, గోనెల మధుకర్, రాజిరెడ్డి, సదానందం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని గురుకులంలో ఘటన

దుబ్బాక, మార్చి 15: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థి బాత్‌రూంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో తోటి విద్యార్థులు గమనించడంతో విద్యార్థి ప్రాణాలు దక్కాయి. ఆ విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానకు తరలించారు. వివరాలు.. దౌల్తాబాద్ మండలం గుప్పలేగికి చెందిన స్వప్నా, స్వామి దంపతులకు ఇద్దరు సంతానం. వీరు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. పెద్ద కొడుకు అఖిల్‌ను హబ్షీపూర్ జ్యోతి బాపూలే గురుకులంలో చేర్పించారు. చిన్న కొడుకును హైదరాబాద్‌లో తమవద్దనే ఉంచుకుని చదివిస్తున్నారు. అఖిల్ గతేడాది సిద్దిపేట మండలం నారాయణరావుపేట మహాత్మాజ్యోతి బాపూలే గురుకులంలో 6వ తరగతి చదువుకుని, ఈఏడాది హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో చేరాడు. గురుకులంలో వసతులు సరిగ్గా లేక పోవడంతో పాటు ఇక్కడి వాతావరణం నచ్చ లేదంటూ తల్లిదండ్రులకు అఖిల్ పలుమార్లు చెప్పాడు. కొద్ది రోజులుగా అఖిల్ మనోవేదనతో బాధపడుతున్నాడు. శనివారం వేకువజామున విద్యార్థులతో కలిసి క్రీడా మైదానానికి వచ్చాడు. తనకు అనారోగ్యంగా ఉందని వ్యాయామ ఉపాధ్యాయుడితో చెప్పి గదిలోకి వెళ్లకుండా బాత్‌రూమ్‌కు వెళ్లి డోరుకు తాడుతో ఉరివేసుకున్నాడు. అటుగా వెళ్లిన విద్యార్థులు గమనించి, పరిస్థితిని వ్యాయామ ఉపాధ్యాయుడికి సమాచారం ఇచ్చారు. పాఠశాల సిబ్బంది వెంటనే వెళ్లి అఖిల్‌ను రక్షించారు. కొన ఊపిరితో ఉన్న అఖిల్‌ను రక్షించి, సీపీఆర్ చేశారు. ఆనంతరం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట జిల్లా దవాఖానకు తరలించారు. అఖిల్‌కు మూర్ఛ సంబంధిత సమస్య ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నిలోఫర్ దవాఖానకు తరలించారు. అఖిల్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తెలిపారు.

గురుకులాన్ని సందర్శించిన చైర్మన్..

హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో 7వ తరగతి విద్యార్థి అఖిల్ ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురుకులు పాఠశాలను సందర్శించారు. సంఘటనపై ఆయన పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థికి అండుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ తిరుపతిరెడ్డితో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని నిలోఫర్ దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫోన్ ద్వారా ఆయన కోరారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

గురువన్నపేటలో కలెక్టర్ మనుచౌదరికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

31 పాఠశాలల్లో ఏఐ బోధన అమలు

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

కొమురవెల్లి, మార్చి 15: విద్యార్థులు లక్ష్యంపై దృష్టిసారించి గమ్యానికి చేరుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ) కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ఫౌండేషన్ లిటరసీ న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) పోగ్రాం ద్వారా గణితం, తెలుగు అభ్యసన సామర్థ్యం పెంచేందుకు ఏఐని అమలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 31 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. శనివారం 29 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారభించినట్లు తెలిపారు. జిల్లాలో రూ.30 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 30 టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ప్రహరీలు తదితర నిర్మాణాలు చేపట్టామని, ఇందులో ఇప్పటి వరకు రూ.19 కోట్లు విడుదల చేశామన్నారు. గురువన్నపేట పాఠశాలలో చేపట్టిన నిర్మాణాలకు పెండింగ్‌లో ఉన్న రూ. 5లక్షల బిల్లులను వెంటనే అమ్మ ఆదర్శ కమిటీలకు విడుదల చేస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన ప్రహరీ, ఐదు కంప్యూటర్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బస్ సౌకర్యం, సైన్స్ రూమ్, అదనపు తరగతుల గదిని విద్యార్థుల సంఖ్య పెరిగితే మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. పాఠశాలలో తాము చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు కోసం అధికారులకు రూ.8 వేల లంచం ఇచ్చినట్లు పాఠశాల అమ్మ కమిటీ చైర్‌పర్సన్ అన్నబోయిన బాలమణి, ప్రాథమిక పాఠశాల అమ్మ కమిటీ చైర్‌పర్సన్ పుట్ట స్వప్న కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ చర్యలకు ఆదేశించారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని అనంతరం గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గురువన్నపేట నుంచి కుకునూరుపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని, తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా గ్రామ చెరువులోకి నీళ్లు వచ్చేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఏఎస్‌వో భాస్కర్, మండల విద్యాధికారి రమేశ్, ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమేశ్, అమ్మ కమిటీ పాఠశాల చైర్‌పర్సన్లు బాలమణి, స్వప్న, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరు అప్రజాస్వామికం

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి
- జహీరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ, ధర్నా

జహీరాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, మార్చి 15: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై ఏకపక్షంగా విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని జహీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ధర్నాను నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జగదీశ్‌రెడ్డిని సస్పెన్షన్ చేశారని ఆరోపించారు. హామీలపై బడ్జెట్ సమావేశాల్లో సమాధానం చెప్పడానికి దమ్ము, ధైర్యం లేకనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వెంటనే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని హెచ్చరించారు. ఆనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు తట్టు నారాయణ, నర్సింహులు, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, నామ రవికిరణ్, భాస్కర్, యాకూబ్, నర్సింహగౌడ్, బండి మోహన్, మంజుల, అనుషమ్మ, రాకేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురు విద్యార్థుల డిబార్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 15: సంగారెడ్డి జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఎనిమిదో రోజు ద్వితీయ సంవత్సరం గణితం-2బీ, జువాలాజీ, హిస్టరీ పరీక్షలు సజావుగా జరిగాయి. 98.29 హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఏర్పాటు చేసిన 54 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 13,987 మంది విద్యార్థులకు 239 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కేటగిరీలో 1263 మందికి 1194 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రామ్ తెలిపారు. జహీరాబాద్‌లో ఇద్దరు, తపస్య కళాశాలలో ఒకరు, కోహీర్‌లో ఒకరు విద్యార్థులు డిబార్ అయ్యారని ఆయన తెలిపారు.

పన్నులు చెల్లించకపోతే నోటీసులివ్వండి

తూప్రాన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న శ్రీపాదరామేశ్వరరావు

తూప్రాన్, మార్చి 15: సకాలంలో పన్నులు చెల్లించని టాప్ 100 ప్రాపర్టీలకు నోటీసులు జారీ చేసి, జప్తు చేయాలని సీడీఎంఏ కార్యాలయ ప్రత్యేకాధికారి శ్రీపాద రామేశ్వరరావు అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర నాన్ ప్రాపర్టీ ట్యాక్సెస్ కలెక్షన్‌లపై రివ్యూ చేయడానికి శనివారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయానికి విచ్చే